క్లుప్తంగా

సుతారిపల్లిలో వైద్య శిబిరం



వైద్య శిబిరంలో గ్రామస్తులు

రామాయంపేట(మెదక్): మండలంలోని సుతారిపల్లిలో కీళ్లవ్యాధి ప్రబలుతుండటంతో ప్రగతి ధర్మారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వారు సోమవారం ప్రత్యేకంగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బంది గ్రామంలో పర్యటించి పారిశుద్ధ్య పరిస్థితిని సమీక్షించి, నిల్వ ఉన్న నీటిని తొలగించారు. అనంతరం ధర్మారం పీహెచ్‌సీ డాక్టర్ హరి ప్రియ మాట్లాడుతూ.. గ్రామంలో మురుగు నీరు నిల్వ ఉండకుండా చూడాలని చెప్పారు. ఇళ్ల పరిసరాల్లో చెత్తా చెదారాన్ని తొలగించుకోవాలని గ్రామస్తులకు సూచించారు.

శేరిపల్లిలో మిషన్ భగీరథ నీటి పరీక్షలు



నీటి పరీక్షలు చేస్తున్న అధికారులు

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండలం శేరిపల్లి గ్రామంలో సోమవారం హర్‌గర్ జల్ జీవన్ మిషన్ ఆధ్వర్యంలో మిషన్ భగీరథనీటి నాణ్యత పరీక్షలు నిర్వహించారు. మిషన్ భగీరథ ఏఈ స్వప్న, టీం సభ్యులు శ్యామయ్య, శ్రీను మిషన్ భగిరథ నీటి నాణ్యతతో పాటు మినరల్స్, క్లోరినేషన్ పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా భగీరథ ఏఈ మాట్లాడుతూ.. నీటి నాణ్యత, మినరల్స్ లేవల్ నాణ్యతతో ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి నాగరాజు, వాటర్ వర్కర్స్ అనిల్, యాదగిరి, మహేశ్ ఉన్నారు.

బొమ్మలతో విద్యాబోధన చేయాలి



వంటకార్మికులతో మాట్లాడుతున్న ఎంఈఓ

టేక్మాల్(మెదక్): విద్యార్థులకు నాణ్యమైన విద్య నందించేందుకు బొమ్మలతో బోధించాలని ఎంఈఓ నీలకంఠం తెలిపారు. సోమవారం టేక్మాల్ మండల పరిధిలోని బొడ్మట్‌పల్లి ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా సందర్శించి పలు రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు ప్రాథమిక స్థాయి నుంచి మంచి బోధనను అందిస్తే ఉన్నత స్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధిస్తారన్నారు. ఆయన వెంట పాఠశాల హెచ్ఎం సాజిద్ ఉన్నారు. అనంతరం టేక్మాల్ ఉన్నత పాఠశాలలోని మధ్యాహ్న భోజన కార్మికులతో మాట్లాడుతూ.. మెను ప్రకారం భోజనం చేయాలన్నారు. తమకు సమయానికి బిల్లులు వచ్చేలా తగు చర్యలు తీసుకుంటామన్నారు.

తక్షణమే రుణమాఫీ చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

పాపన్నపేట(మెదక్): ప్రభుత్వం వెంటనే రుణమాఫీ చేయాలని కోరుతూ బీజేపీ కిసాన్ మోర్చా నాయకులు సోమవారం పాపన్నపేట తహసీల్దార్ లక్ష్మణ్ బాబుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మండలాధ్యక్షుడు రాములు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏడు నెలలు కావస్తున్నా ఇంత వరకు రుణమాఫీ చేయలేదని ఆరోపించారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా నాయకులు సిద్ధిరాములు, ఇమానియల్, కిష్టయ్య, ప్రకాష్, విఠల్ పాల్గొన్నారు.

కరెంట్ సమస్యలపై ధర్నా



సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న రైతులను సముదాయిస్తున్న ఏడీ భాస్కర్ రెడ్డి

నర్సాపూర్ రూరల్: కరెంట్ సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని సోమవారం మండలంలోని చిప్పలదుర్తి గ్రామస్తులు, రైతులు సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతీరోజు 20 నుంచి 30 సార్లు కరెంట్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. దీంతో సబ్‌స్టేషన్ ఎదుట ధర్నాకు దిగినట్లు చెప్పారు. ఈ విషయం తెలుసుకున్న నర్సాపూర్ ఏడీ భాస్కర్‌రెడ్డి అక్కడికి చేరుకొని కరెంట్ సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ రెడ్డి, లక్ష్మణ్‌గౌడ్, గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

వనమహోత్సవానికి సిద్ధం

- మండలంలో 1.11లక్షల మొక్కలు నాటడమే లక్ష్యం
- ప్రణాళిక రూపొందించిన అధికారులు
- ముమ్మరంగా సాగుతున్న పనులు



మల్కాపూర్‌లోని నర్సరీకి నీరుపడుతున్న సిబ్బంది



అచ్చన్నపల్లిలో మొక్కలు నాటేందుకు గుంతలు తీస్తున్న కూలీలు

టేక్మాల్(మెదక్): వనమహోత్సవంలో భాగాంగా మొక్కలు నాటేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. అయితే ఈసారి భారీ లక్ష్యాన్ని నిర్దేశించకుండా, నాటిన మొక్కలన్నింటినీ సంరక్షించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం వనమహోత్సవ కార్యక్రమ ఏర్పాట్లు చేస్తున్నారు. హరితహారంలో నాటిన మొక్కలు కొన్నిచోట్ల ఏపుగా పెరిగాయి. మరికొన్ని గ్రామాల్లో నాటిన ఆనవాలు లేకుండా పోయాయి. ప్రత్యేక శ్రద్ధ తీసుకున్న చోట మొక్కలు పెరుగుతున్నాయి. నాటి వదిలేస్తుండటంతో రెండు మూడు నెలల్లోనే ఎండి కనుమరుగవుతున్నాయి. ఈ నేపథ్యంలో మొక్కల సంరక్షణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులు నిర్ణయించారు. గతంలో ఆదేశించినట్లుగా భారీగా మొక్కలు నాటాలన్న లక్ష్యం నిర్దేశించకుండా లక్ష్యాన్ని సగానికి తగ్గించారు. నాటిన మొక్కలను బతికించాలన్న సంకల్పంతో ముందుకు సాగుతున్నారు. వర్షాలు కురిసిన వెంటనే ప్రభుత్వ ఆదేశాల మేరకు వనమహోత్సవం ప్రారంభించనున్నారు.

ముమ్మరంగా ఫిట్టింగ్

వనమహోత్సవాన్ని నిర్వహించేందుకు ఉపాధి హామీ సిబ్బంది రోడ్ల వెంబడి, ఖాళీ ప్రదేశాల్లో కూలీలకే ఫిట్టింగ్ చేయిస్తున్నారు. గ్రామాల వారీగా టార్గెట్ పెట్టుకొని గుంతలు తీసి సిద్ధంగా ఉంచుతున్నారు. గతంలో ఎక్కువ మొక్కలు నాటలన్నా లక్ష్యం ఉండగా ఈసారి 1.11 లక్షల టార్గెట్ విధించారు. గ్రామానికి ఒక నర్సరీ మండలంలో 29 పంచాయతీలకు అన్ని గ్రామాల్లోనూ నర్సరీలను ఏర్పాటు చేశారు. నర్సరీల బాధ్యత గ్రామ పంచాయతీలకు అప్పగించారు. ఎప్పటికప్పుడు కార్యదర్శులు నర్సరీలను పర్యవేక్షిస్తూ మొక్కలు సంరక్షిస్తున్నారు. నర్సరీలో సుమారుగా 30 రకాల పండ్ల, పూల మొక్కలతో పాటూ ఇతర మొక్కలను పెంచుతున్నారు. మొక్కలకు ఈసారి జియో ట్యాంగింగ్ చేస్తున్నారు.

అందరి భాగస్వామ్యంతో..



వనమహోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం. అన్ని శాఖల పరిధిలో మొక్కలు నాటేందుకు సిద్ధం చేశాం. ప్రభుత్వం ఆదేశించిన తేదీ నుంచి మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభమవుతుంది. ప్రజాప్రతినిధులతో పాటూ ప్రజలందరూ భాగస్వాములు అయితేనే లక్ష్యాన్ని చేరగలుగుతాం. మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు ప్రాధాన్యతను ఇస్తాం.

–రియాజొద్దీన్, ఎంపీడీఓ, టేక్మాల్

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మున్సిపల్ చైర్మన్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

నర్సాపూర్ రూరల్: మున్సిపల్ కార్మికులకు ప్రభుత్వం ఫిబ్రవరిలో పెంచిన రూ.1000 వెంటనే అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజు కోరారు. సోమవారం నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్‌కు మున్సిపల్ కార్మికులతో కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు పుష్ప, నర్సాపూర్ మున్సిపల్ కార్మిక అధ్యక్షులు అశోక్, జ్యోతి, అనిత, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



గురువులతో పూర్వ విద్యార్థులు

వెల్దుర్తి(తూప్రాన్): వెల్దుర్తి ఉన్నత పాఠశాలలో 1989–90 విద్యా సంవత్సరానికి చెందిన పదో తరగతి విద్యార్థులు పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. 35 ఏళ్ల త ర్వాత వారంతా ఒకచోట చేరి నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా అప్పటి గురువులను సన్మానించారు. కార్యక్రమంలో అమరేందర్‌రెడ్డి, సుధాకర్‌గౌడ్, సురేశ్‌గుప్తా, రవీందర్‌గౌడ్ పాల్గొన్నారు.

నేటి నుంచి సదరం క్యాంపు

శివ్వంపేట(నర్సాపూర్): మెదక్‌లో దివ్యాంగుల గుర్తింపు కోసం సదరం క్యాంపు మంగళవారం నుంచి 19 వరకు నిర్వహిస్తామని ఐకేపీ ఎంపీఎం వెంకటేశ్వర్లు తెలిపారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగులను గుర్తించి వారికి ధృవీకరణ పత్రాలు ఇస్తామన్నారు. క్యాంపుకు వచ్చే వారు మీ సేవ, ఈ సేవలో స్లాట్ బుక్ చేసుకోవాలన్నారు. 9న దృష్టిలోపం, 10న శారీరక దివ్యాంగులు, 18న మూగ, వినికిడి లోపం, 19న మానసిక దివ్యాంగుల కోసం క్యాంపు జరుగుతుందన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 లోపు హాజరు కావాలని కోరారు.

పెచ్చులూడిన ఎంపీడీఓ కార్యాలయం పైకప్పు

కౌడిపల్లి(నర్సాపూర్): చిన్నపాటి వర్షానికి ఎంపీడీఓ కార్యాలయం భవనంలోని ఒగదిలో పైకప్పు పెచ్చులూడి కిందపడ్డాయి. ఆ సమయంలో ఆగదిలో ఎవరు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఎంపీడీఓ కార్యాలయం ఇప్పటికే శిథిలావస్థకు చేరింది. సోమవారం చిన్న పాటి వర్షం కురవడంతో భవనం ఉరుస్తోంది.



ఎంపీడీఓ కార్యాలయం భవనంలోని ఓ గదిలో పెచ్చులూడి కిందపడిన దృశ్యం

సంక్షిప్త వార్తలు

◆ నోట్‌పుస్తకాల పంపిణీ



అల్లాదుర్గం(మెదక్): ముస్లాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదిమంది పేద విద్యార్థులకు ఉపాధ్యాయురాలు రుక్మిణి తన సొంత డబ్బులతో 200ల నోట్,హ్యాండ్ రైటింగ్ పుస్తకాల సోమవారం పంపిణీ చేశారు.

తూప్రాన్: పట్టణంలోని బాలుర-బాలికల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రులను కోల్పోయిన అనాథ విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేసినట్లు ట్రస్ట్ అధ్యక్షుడు రవి నాయక్ సోమవారం అన్నారు. దాత కాసు శ్రీనివాస్ రావు, కాసు హరిక సహకారంతో పాఠశాలలో 30 మంది విద్యార్థులకు పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం పార్వతి, బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎం ఫ్లోరెస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ కరెంట్‌షాక్‌తో గేదె మృతి

కౌడిపల్లి(నర్సాపూర్): ట్రాన్స్‌ఫార్మర్ వద్ద కరెంట్ షాక్‌తో గేదె మృతి చెందింది. ఈ సంఘటన మండలంలోని తునికి దేవులతండా సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద సోమవారం జరిగింది. దేవులతండాకు చెందిన కొర్ర రవి పశువులను రోజుమాదిరిగా మేతకు తీసుకెళ్లారు. ట్రాన్స్‌ఫార్మర్ పక్కన గేదె మేత మేస్తుండగా కరెంట్‌షాక్ తగలడంతో అక్కడికక్కడే మృతి చెందింది. సుమారు రూ. 20వేలకుపైగా నష్టం జరిగినట్లు బాధితుడు చెప్పారు.

◆ కార్గో ట్రాన్స్‌ఫోర్ట్ సౌకర్యం కల్పించండి

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రం కౌడిపల్లికి ఆర్టీసీ అధికారులు కార్గో ట్రాన్స్‌పోర్ట్ సేవలు కల్పించాలని వ్యాపారస్తులు కోరారు.

◆ తైబజార్ వేలం

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని రంగంపేట తైబజార్ ఏడాదికి సోమవారం వేలం నిర్వహించారు. గ్రామ ప్రత్యేకాధికారి తహసీల్దార్ గఫూర్ మియా ఆధ్వర్యంలో జరిగిన ఈ వేలాన్ని బొద్దుల జోగయ్య అనే వ్యక్తి రూ.1 లక్ష 47 వేలకు దక్కించుకున్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నగేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

◆ రెడ్డిపల్లిలో హెల్త్ క్యాంప్

నర్సాపూర్ రూరల్: మండలంలోని రెడ్డిపల్లి లో సోమవారం రెడ్డిపల్లి పీహెచ్‌సీ వైద్య బృందం ఉచిత హెల్త్ క్యాంప్ నిర్వహించారు. గ్రామస్తులకు పరీక్షలు చేసి. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది నిర్మల, సుప్రియా, దేవి, ఆశ వర్కర్లు జ్యోతి పాల్గొన్నారు.

◆ అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ సీజ్

తూప్రాన్: అక్రమంగా కిష్టాపూర్ హల్దీవాగు నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్ఐ–2 యాదగిరి సోమవారం తెలిపారు. అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను ట్రాక్టర్‌లో తరలిస్తున్న సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసి, ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

◆ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి

కొల్చారం(నర్సాపూర్): రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ మహమ్మద్ గౌస్ తెలిపిన వివరాల ప్రకారం ... మెదక్ పట్టణం నర్సికేడ్ వీధి చెందిన బాజా రమేశ్(21) పోతంశెట్టిపల్లి శివారులోని ఏడుపాయల టీ జంక్షన్ వద్ద బైక్ అదుపుతప్పి తలకు తీవ్ర గాయమైంది. అతను చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

◆ వివాహిత మహిళ అదృశ్యం

తూప్రాన్: మండలంలోని ఇస్లాంపూర్ గ్రామానికి చెందిన వివాహిత మహిళ అదృశ్యమైనట్లు ఎస్ఐ–2 యాదగిరి సోమవారం తెలిపారు. గ్రామానికి చెందిన బెడ బుడగ జంగం కులానికి చెందిన వెంకటమ్మ అనే మహిళ ఈ నెల 6న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి చేరుకోలేదన్నారు. ఎక్కడా ఆచూకీ లభించలేదని కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టామని ఎస్ఐ తెలిపారు.

◆ పాఠశాల తనిఖీ

పాపన్నపేట(మెదక్): పాపన్నపేట ప్రాథమిక పాఠశాల తెలుగు, ఉర్దూ మీడియం పాఠశాలను ఎంఈఓ నీలకంఠం సోమవారం తనిఖీ చేశారు.

◆ హామీ తీర్చండి

అల్లాదుర్గం(మెదక్): ఎన్నికల ముందు అల్లాదుర్గం మండలాన్ని సంగారెడ్డి జిల్లాలో కలపాలని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ మండల నిరుద్యోగులు కోరారు. మంత్రిగా ఉన్న దామోదర్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని, అల్లాదుర్గంను సంగారెడ్డి జిల్లాలో కలపాలని డిమాండ్ చేస్తున్నారు.

వైఎస్సార్ జయంతి వేడుకలు



రామాయంపేటలో వైఎస్సార్ జయంతి వేడుకలో కాంగ్రెస్ కార్యకర్తలు

జిల్లా వ్యాప్తంగా సోమవారం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణాల్లో, గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతరం పాపన్నపేట మండలంలో మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ.. అక్కన్నపేట–మెదక్ రైల్వే లైన్ ఏర్పాటు దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చొరవేనని ఆయన్ను కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నర్సాపూర్ రూరల్: నర్సాపూర్ పట్టణంలో..



వెల్దుర్తి(తూప్రాన్): మాసాయిపేటలో ..

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



నీటి నిల్వపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎంపీహెచ్ఈఓ మదన్ మోహన్

కొల్చారం(నర్సాపూర్): వానాకాలం సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీహెచ్ఈఓ మదన్ మోహన్ సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఆవరణలో సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎంపీడీఓ లక్ష్మీనర్సింలు ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో ఎంపీహెచ్ఈఓ మాట్లాడుతూ.. గ్రామంలోని మురికి కాల్వలు, నీటి నిల్వ ప్రదేశాలను శుభ్రంగా ఉంచేందుకు గ్రామ పంచాయతీ సిబ్బంది పని చేయాలన్నారు. ఆరుబయట నీటిని నిల్వ చేయడం, ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచకుంటే దోమలు వ్యాపించి మలేరియా, డెంగీ వ్యాధులు వచ్చే ప్రమాదం పొంచి ఉంటుందన్నారు. పొగ తాగే వారిని, డయాబెటిక్, టీబీ మందులు వాడుతున్న వారిని గుర్తించి ఈ నెలాఖరు వరకు స్పెషల్ డ్రైవ్ ద్వారా బీసీజీ టీకా వేస్తున్నట్లు తెలిపారు. అంతకుముందు గ్రామంలో పర్యటించి ఆరుబయట నీటిని నిల్వ చేసిన వాటిని పారపోశారు. ఈ సదస్సులో పంచాయతీ కార్యదర్శి అంజయ్య, పీహెచ్ఎన్ ఏసుమని, ఏఎన్ఎం ఉషాశ్రీ, ఆశ వర్కర్లు ప్రజలు పాల్గొన్నారు.

చిలప్‌చెడ్(నర్సాపూర్): సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తగా ఉండాలని ఎంపీడీఓ ఆనంద్ అన్నారు. సోమవారం మండలంలోని సొమ్లతండాలో వాటర్ ట్యాంక్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా వాటర్‌ట్యాంక్, నల్లాలతో పాటు మంచినీటి వసతి ఉన్న ప్రతీచోట శుభ్రంగా ఉంచాలన్నారు. వాటర్ ట్యాంక్‌ను ప్రతీవారం శుభ్రం చేసి బ్లీచింగ్ ఫౌడర్‌తో క్లోరినేషన్ చేయాలన్నారు. గ్రామాలు, తండాల్లో మురికి కాల్వ చెత్త చెదారం పేరుకుపోకుండా శుభ్రంగా ఉంచాలని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మనోజ్ పాల్గొన్నారు.

కనులపండువగా బోనాల ఊరేగింపు



వెల్దుర్తిలో బోనాల ఊరేగింపులో భక్తులు

వెల్దుర్తి(తూప్రాన్): ఆషాఢమాస బోనాల పండుగ సందర్భంగా మండల కేంద్రమైన వెల్దుర్తిలో సోమవారం గౌడ సంఘం ఆధ్వర్యంలో బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. రెండు రోజుల పాటు నిర్వహించే ఉత్సవాల్లో భాగంగా మొదటిరోజు గ్రామ దేవతలైన పోచమ్మ, ముత్యాలమ్మ అమ్మవార్లకు బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా అందంగా అలంకరించిన బోనాలను డప్పు చప్పుళ్ల మధ్య పట్టణంలో ఊరేగించారు. అనంతరం పాడిపంటలతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారికి బోనాలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు.

ప్రజావాణిలో వినతుల వెల్లువ



రామాయంపేట(మెదక్): తహసీల్దార్ రజనీకుమార్కికి దరఖాస్తు అందిస్తున్న పద్మ



నర్సాపూర్‌లో ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న షేక్ సమీర

రామాయంపేటలో 50 దరఖాస్తులు

రామాయంపేట(మెదక్): మండల కేంద్రాల్లో మొదటిసారిగా నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా రామాయంపేటలో 50 దరఖాస్తులు అందాయని తహసీల్దార్ రజనీకుమారి తెలిపారు. వ్యవసాయ భూముల సమస్యలతో పాటు రేషన్‌కార్డులు, రెండు పడకల ఇళ్ల మంజూరు, ఇతరత్రా సమస్యలపై మండల ప్రజలు దరఖాస్తులు అందజేశారని చెప్పారు.

నర్సాపూర్‌లో ఎనిమిది

నర్సాపూర్: తన భూమిని కాపాడాలని శివ్వంపేట మండలం పిల్లుట్ల గ్రామానికి చెందిన షేక్ సమీర సోమవారం ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కాగా గ్రామానికి చెందిన పెద్దపులి కృష్ణ, పెద్దపులి శంకర్‌లు తన భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. విచారణ చేయించి తగిన చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ ఆమెకు చెప్పారు. ప్రజావాణిలో ఎనిమిది దరఖాస్తులు వచ్చాయని ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి చెప్పారు.

మనోహరాబాద్‌లో ఆరు

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో ప్రజావాణిలో వివిధ సమస్యలపై 6 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో డీటీ కౌశిక, ఆర్ఐ దీక్షిత్ తదితరులున్నారు.

కౌడిపల్లిలో ఒక్కటి

కౌడిపల్లి(నర్సాపూర్): ప్రజావాణిలో ఒక్క దరఖాస్తు మాత్రమే వచ్చినట్లు తహసీల్దార్ ఆంజనేయులు తెలిపారు. కౌడిపల్లి తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం తహసీల్దార్‌తో పాటు ఎంపీడీఓ శ్రీనివాస్, ఏపీఓ పుణ్యదాస్, ఇన్‌చార్జి ఎంపీఓ వెంకటేశం ప్రజావాణి నిర్వహించారు. తునికి గ్రామానికి చెందిన రూప తన అత్త చెప్పకుండా భూమి అమ్మకానికి స్లాట్ బుక్ చేసిందని, తనకు పిల్లలు ఉన్నందున భూమి అమ్మకాన్ని రిజిస్ట్రేషన్ చేయకుండా ఆపాలని దరఖాస్తు చేసినట్లు చెప్పారు.

చిన్నశంకరంపేటలో ఒక్కటి

చిన్నశంకరంపేట(మెదక్): తనకి జీరో విద్యుత్ బిల్లు రావడంలేదని మండలంలోని మిర్జాపల్లి గ్రామానికి చెందిన పొలంపల్లి చంద్రయ్య తహసీల్దార్ మన్నన్‌కు వినతిపత్రం అందించారు. మిర్జాపల్లికి చెందిన చంద్రయ్య తనకు జీరో బిల్లు అందించి న్యాయం చేయాలని కోరారు.

చేగుంటలో ఒక్కటి

చేగుంట(తూప్రాన్): మండలంలోని రెడ్డిపల్లి గ్రామానికి చెందిన కరసాని ఎల్లం తన కొత్త పాస్ పుస్తకంలో మూడు సర్వేనంబర్లు రావడం లేదని ప్రజావాణిలో తహసీల్దార్ స్వప్నకు దరఖాస్తు అందించారు. కార్యక్రంలో ఐర్ఐ నర్సింగ్ యాదవ్ రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

పెద్దశంకరంపేట(మెదక్): పేట తహసీల్దార్ కార్యాలయంలో ధరణి సమస్యలపై ప్రజల నుంచి తహసీల్దార్ గ్రేస్‌బాయి దరఖాస్తులు స్వీకరించారు. డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్ తదితరులున్నారు.

తూప్రాన్‌లో 16

తూప్రాన్: పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ జయచంద్రరెడ్డి ప్రజల నుంచి వచ్చిన 16 దరఖాస్తులను స్వీకరించినట్లు తెలిపారు.

శివ్వంపేటలో 6

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రంలో ప్రజావాణిలో భూ సమస్యలపై 6 దరఖాస్తులు వచ్చాయని ఇన్‌చార్జి తహసీల్దార్ షఫీయొద్దీన్ అన్నారు.

కొల్చారంలో ఐదు

కొల్చారం(నర్సాపూర్): మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో 5 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ గఫూర్ మియా తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మీనర్సింలు పాల్గొన్నారు.